క్లుప్తంగా

స్థల పరిశీలన



నడిపల్లిలో స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

పూసపాటిరేగ: మండలంలోని నడిపల్లి, వెంపడాం గ్రామాల పరిధిలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అధికారుల బృందం గురువారం పరిశీలించింది. వెంపడాంలో స్థలం అనుకూలమా కాదా అనే విషయమై పరిశీలన చేశారు. నడిపల్లి జగనన్న కాలనీ సమీపంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ తాడ్డి గోవింద, విద్యుత్‌శాఖ ఏఈ దేముడు, మండల సర్వేయర్ గణపతిరావు స్థల పరిశీలన చేసినవారిలో ఉన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

విజయనగరం: వచ్చే వేసవి నాటికి విజయనగరం పట్టణం పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూస్తామని, మరమ్మతులకు గురైన బోర్లను బాగుచేస్తామని కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ సిబ్బంది నగరంలో ప్రస్తుతం మరమ్మతులకు గురైన బోర్లను గుర్తించి వాటిని బాగుచేస్తున్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశించారు. నీటి పంపిణీకి అవసరమైన రిజర్వాయర్ల స్థితిగతులు, పంపింగ్ విధానం, పైప్‌లైన్ లీకుల నివారణ వంటి చర్యలపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

భోగాపురం: గ్రామీణ ప్రజలకు ఇంటి వద్దకే వైద్యసేవలు అందించడమే 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం ఉద్దేశమని పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు పి.శ్రవంతి తెలిపారు. మండల కేంద్రంలోని తోటవీధిలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 75 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. డయేరియా, డెంగి, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌వీ అరుణ, డీఈఓ హేమంత్, హెల్త్ అసిస్టెంట్ రమణ, పురుషోత్తం, ఏఎన్‌ఎం పద్మావతి, ఆశ వర్కర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తం

పూసపాటిరేగ: క్షయవ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలని గోవిందపురం పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకట సుదారెడ్డి సూచించారు. మండలంలోని కందివలస హెచ్‌బీఎల్ పరిశ్రమలో క్షయవ్యాధి నివారణ, చికిత్స తదితర అంశాలపై గురువారం కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులు మద్యపానం, దూమపానం, ఖైనీ, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. ఆరోగ్యపట్ల జాగ్రత్తలు తీసుకున్నట్లయితే ఆయుస్సు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయవ్యాధి నివారణ కోఆర్డినేటర్లు కుమార్, నాగరాజు, శ్రీనివాస్, సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఆరోగ్య సహాయకులు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన



కోలాటం ఆడుతున్న విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ పద్మలత బాలల దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన కూచిపూడి, భరతనాట్యం, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేశంలో మతతత్వం పెరిగిపోయింది

విజయనగరం పూల్‌బాగ్: స్థానిక అమర్‌భవన్‌లో డీబీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రేగేటి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం 'సనాతన ధర్మమా? సమ సమాజ సందేశమా' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో మతతత్వ ప్రమాదకర స్థాయికి చేరుకుందని, దీని వల్ల దళితులు, ముస్లింలు, మైనార్టీలు, బీసీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభావం నుంచి బయటపడాలంటే మతతత్వ పోకడలను ఎదుర్కోవాలని, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, ప్రజా విజయం పార్టీ అధ్యక్షుడు పి.షణ్ముఖరావు, ఎం.ముత్యాలు, ఎ.ఆనందరావు పాల్గొన్నారు.

కూటమి నేతల కుట్రలు

- వీఓలపై రాజకీయ కక్ష
- గ్రామ సంఘం తీర్మానం లేకుండానే విధుల నుంచి తొలగింపు
- నాడు వీఓల గౌరవ వేతనం పెంచి వారికి అండగా నిలిచిన మాజీ సీఎం వైఎస్ జగన్
- న్యాయ పోరాటాలకు సిద్ధమవుతున్న వీఓలు



విజయనగరం రూరల్: మండలంలో గత పదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న వీఓలపై టీడీపీ నాయకులు కన్నెర్ర చేస్తున్నారు. అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి వారిని తొలగించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే మండలంలో పినవేమలి, ద్వారపూడి గ్రామాల వీఓలను అక్రమంగా తొలగించారు. సంబంధిత వీఓలపై వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి వారిని తొలగించి వారి స్థానంలో టీడీపీ సానుభూతి పరులను నియామకాలు చేపట్టారు. సంబంధిత అధికారులు అధికార పార్టీ నాయకులు చెప్పించే వేదంలా భావించి పనులు చక్కపెడుతున్నారు. గత కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను అర్థాంతరంగా తొలగిస్తే మా జీవనం ఎలా కొనసాగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాడు వీఓలకు అండగా జగన్

2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం వీఓలకు కేవలం రూ.3 వేలు మాత్రమే ఇచ్చేది. 2019లో వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వీఓల గౌరవ వేతనాన్ని ఒకేసారి రూ.3 వేలు నుంచి రూ.10 వేలు చేసి వారి కళ్లల్లో ఆనందాన్ని నింపింది. జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కసారిగా వేతనాలు పెంచడంతో వీఓలు అంతా గడిచిన ఐదేళ్లు ఎంతో చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువచ్చారు. దీన్ని అక్కసుగా తీసుకున్న టీడీపీ నాయకులు తమ గ్రామాల్లో ఉన్న వీఓలను అక్రమంగా తొలగించి తమ అనుచరులను ఆ స్థానంలో వేసుకునేందుకు కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నారు. ఇందుకు కొంతమంది అధికారులు ఒప్పుకోకపోయినా వారిపై ఒత్తిడి తీసుకు వచ్చి బలవంతంగా ఒప్పిస్తున్నట్లు వీఓలే చెపుతున్నారు.

తీర్మానాలు ఎక్కడ

బైలా సర్కులర్ ప్రకారం వీఓల కాలపరిమితి మూడేళ్లు ఉంటుంది. ఆ తరువాత గ్రామ సంఘాల సమాఖ్య సమావేశం నిర్వహించి తీర్మానాలు చేసి కొనసాగించడం, లేదా స్థానాలు మార్చడం, లేదా తొలగించడం చేస్తారు. అయితే ఇప్పుడు అందుకు విరుద్ధంగా స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సులతో ఎటువంటి తీర్మానాలు లేకుండా, కనీసం సంబంధిత వీఓలకు సమాచారం కూడా ఇవ్వకుండా హుటాహుటిన మండలంలో ఇద్దరు వీఓలను తొలగించారు. ఈ విషయమై సంబంధిత ఏపీఎం స్వామి వద్ద సాక్షి ప్రస్తావించగా.. గ్రామ సంఘాల ఆమోదంతో, వారి తీర్మానంతోనే వీఓల తొలగింపు జరిగిందని తెలిపారు.

ముమ్మాటికీ టీడీపీ నాయకుల పనే..



గల పదేళ్లుగా పినవేమలి గ్రామ వీఓగా విధులు నిర్వహిస్తున్నాను. సంఘాలకు చేదోడు వాదోడుగా ఉంటూ బాధ్యతలు నిర్వహిస్తున్నాను. ఎన్నడూ రిమార్క్ కూడా రాలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక కనీసం సమాచారం ఇవ్వకుండా, గ్రామ సంఘాల తీర్మానం లేకుండా నన్ను విధుల్లో నుంచి తొలగించారు. ఇది తీరని అన్యాయం. కక్ష సాధింపు పనిగా టీడీపీ నాయకులే పనిగట్టుకుని నన్ను తొలగించారు.

– కెంగువ లక్ష్మి, వీఓ, పినవేమలి

అధికారులపై ఒత్తిడి తెచ్చారు



ద్వారపూడి గ్రామ వీఓగా విధులు నిర్వహించాను. మా గ్రామానికి చెంది 57 సంఘాలకు అవసరమైన సేవలు అందించాను. గ్రామంలోని కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకులు సంబంధిత అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి నన్ను విధుల్లో నుంచి తొలగించారు. ఇది ముమ్మాటికీ కక్షపూరిత చర్యే. దీనిపై పోరాటం చేస్తాం.

– శిడగం లత, వీఓ, ద్వారపూడి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది విద్యుత్‌శాఖ ఈఈ పెద్దింటి త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విజయనగరం, వీటీ అగ్రహారం ఫీడర్ల పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ ఏరియా, వీటీ అగ్రహారం, బీసీ కాలనీ, ప్రదీప్ నగర్, మజ్జిపేట, రాంగలి వీధి, సంతోష్‌నగర్, ప్రియానగర్, దుర్గానగర్, వై.జంక్షన్, బాలాజీ మార్కెట్, కణపాక, మంత్రి చెన్నారెడ్డి కాలనీ, సిక్కు కాలనీ, రామయ్యమ్మ కాలనీ, యాతపేట, జర్నలిస్టు కాలనీ, ద్వారపూడి, రెవెన్యూకాలనీ, బ్యాంకు కాలనీ, సాయికీర్తన నగర్, కామాక్షి నగర్, లలితానగర్, కె.ఎల్.పురం, గుంకలం, అయ్యన్నపేట, దుప్పాడ, జొన్నవలస, సారిక, కోరుకొండ, పినవేమలి, పాల్ నగర్, పావని నగర్, అరుంధినగర్, గణేష్ కోవెల, కాంబోయివీధి, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

నెల్లిమర్ల పరిధిలో..

నెల్లిమర్ల: నెల్లిమర్ల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లను తాకుతూ ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపడుతున్నందున ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈ పి.త్రినాథరావు గురువారం ఒకప్రకటనలో తెలిపారు. థామస్‌పేట, మొయిద జంక్షన్, సెగిడివీధి, కందర్పకాలనీ, టీచర్స్‌కాలనీ, గౌడవీధి, బోయవీధి, తెలకలవీధి, రెల్లివీధి, గొల్లవీధి, పద్మశాలీవీధి, తెలగవీధి, చిక్కాల వీధి, గాంధీనగర్‌కాలనీ, జరజాపుపేట ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

నైపుణ్య గణన సర్వే శతశాతం పూర్తిచేయాలి

విజయనగరం: నగరంలో ఇంటింటి నైపుణ్య గణన సర్వే శతశాతం పూర్తిచేయాలని సచివాలయ కార్యదర్శులకు, సిబ్బందికి కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు ఇంటింటి నైపుణ్య గణన విధి విధానాలను గురువారం ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వివిధ రంగాలలో నైపుణ్యం కలిగిన వ్యక్తులను గుర్తించి వారికి మరింత మెరుగైన శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. ఇందులో భాగంగా ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇంటింటికీ వచ్చే తమ సిబ్బందికి పూర్తి వివరాలను అందించాలని ప్రజలను కోరారు. సమావేశంలో టీపీఆర్వో సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, స్కిల్ సెషన్స్ మండల ఇన్‌చార్జి తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలు, వాగులు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య




5వ డివిజన్‌లో పర్యటిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలో గెడ్డలు, వాగులు, ప్రధాన కాలువలు ఆక్రమించి భవన నిర్మాణాలను చేపట్టరాదని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను తొలగిస్తామని కమిషనర్ పల్లి నల్లనయ్య పేర్కొన్నారు. నగరంలోని 5వ డివిజన్‌లో గురువారం ఆయన పర్యటించారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలను గుర్తించి అపరాధ రుసుం వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. గెడ్డను ఆక్రమించి నిర్మించిన ఓ భవనాన్ని గుర్తించి వెంటనే నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని అక్కడివారిని ఆదేశించారు. అలాగే సెట్ బ్యాక్స్ లేకుండా చేపడుతున్న మరో భవన నిర్మాణ పనులను కూడా నిలుపుదల చేయించారు. మరమ్మతులకు గురైన రహదారులు, కాలువల నిర్మాణానికి అవసరమైన అంచనాలను తయారు చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి చెప్పారు. కేంద్రీయ విద్యాలయ భవనానికి పన్ను విధింపుతో పాటు ఖాళీ స్థలంపై పన్ను విధించాలన్నారు. గాంధీ పార్క్‌లో చెత్తాచెదారాలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. టిఫిన్ సెంటర్ల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లు వినియోగించడాన్ని గమనించి, వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు అపరాధ రుసుం విధించారు. అనుమతులు లేని భవన నిర్మాణాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి ఎటువంటి నిర్మాణాలను చేపట్టరాదన్నారు. ప్రణాళిక బద్ధమైన నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, టీపీఆర్వో సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్, వివిధ విభాగాల సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని వక్తలు అన్నారు. అన్ని శాఖా గ్రంథాలయాల్లో గురువారం నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. గ్రంథాలయాల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. – సాక్షి నెట్‌వర్క్



దెంకాడ: గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులతో హెచ్‌ఎం కృష్ణ, తదితరులు



పూసపాటిరేగ: పూసపాటిరేగ గ్రంథాలయంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం బి.శంకరరావు, తదితరులు



విజయనగరం అర్బన్: గ్రంథాలయాల ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న గ్రంథాలయ సేవా సంఘం సభ్యులు



విజయనగరం అర్బన్: విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.సోమశేఖర్

పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయండి: ఎస్పీ



నెహ్రూ వేషధారణలో ఉన్న చిన్నారితో కరచాలనం చేస్తూ ముచ్చటిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడే విషయ పరిజ్ఞానాన్ని అందించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సూచించారు. స్థానిక కంటోన్మెంట్‌లో ఉన్న పోలీస్ వెల్ఫేర్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన చిల్డ్రన్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యనభ్యసించే చిన్నారులకు నామమాత్రపు ఫీజులతో నాణ్యమైన విద్యనందిస్తున్నామన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, పోలీసు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన శిక్షణ

విజయనగరం రూరల్: మండలంలో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసే బాధ్యత మనందరిపై ఉందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తిరుపతిరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సాక్షర భారత్ వలంటీర్లకు గురువారం రెండోరోజు శిక్షణలో ఆయన మాట్లాడారు. చదువురాని డ్వాక్రా మహిళలను గుర్తించి వారికి ప్రతిరోజు రెండు గంటల పాటు వలంటీర్లు శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆనందమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత

నెల్లిమర్ల: గుర్ల మండలం చింతలపేటకు చెందిన సారంపాటి శ్రీను ఇటీవల మృతి చెందారు. అతని పేరు మీద ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ జరజాపుపేట శాఖలో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా తీసుకోవడంతో బ్యాంకు అధికారులు బీమా పరిహారాన్ని అందజేశారు. మృతుని భార్య సారంపాటి రమణమ్మకు బ్యాంక్ మేనేజర్ పాండ్రంకి రవికుమార్ గురువారం రూ.2 లక్షలు చెక్కును అందజేశారు. అనంతరం మేనేజర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద సంవత్సరానికి రూ.436లు ప్రీమియం చెల్లించి బీమా తీసుకున్నట్లయితే సహజ మరణానికి రూ.2 లక్షలు పరిహారం అందుతుందన్నారు. అదేవిధంగా బ్యాంకులో డిపాజిట్లపై అత్యధికంగా 8.1% శాతం వడ్డీ చెల్లిస్తున్నట్లు చెప్పారు. తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫీల్డ్‌ఆఫీసర్ లక్ష్మీవాణి, సీఎస్‌పీ పతివాడ పైడినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీలో ఆన్‌లైన్ వర్క్‌షాప్



పోస్టర్ విడుదల చేస్తున్న వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి

విజయనగరం అర్బన్: జెఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ)లో ఈ నెల 27, 28వ తేదీల్లో 'కంప్యూటరింగ్ ఫర్ ఫ్రెషర్స్' అనే అంశంపై ఆన్‌లైన్ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నామని ఇంజినీరింగ్ కళాశాల ఎస్‌డీసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.హేమ తెలిపారు. వర్క్‌షాప్ షెడ్యూల్ పోస్టర్‌ని యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి గురువారం విడుదల చేశారు. రెండు రోజుల పాటు ప్రతి రోజూ మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఆన్‌లైన్ పద్ధతిలో ఈ వర్క్‌షాప్ ఉంటుందన్నారు. ఇందులో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు పేర్లను నమోదు చేసుకునేందుకు ఫోన్ 9100307727, 926660360 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరావు, వర్సిటీ డైరెక్టర్లు ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, ప్రొఫెసర్ కె.బాబులు, ప్రొఫెసర్ కేసీబీరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు, వైద్యులు దైవంతో సమానం

- మిమ్స్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ప్రవీణ్ వర్మ
- మిమ్స్‌లో చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రవీణ్ వర్మ

నెల్లిమర్ల: పిల్లలు, వైద్యులు దైవంతో సమానమని మిమ్స్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ బి.హెచ్.వి.కె.ప్రవీణ్ వర్మ అన్నారు. నెల్లిమర్ల మిమ్స్ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ముందుగా ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ, బిహేవియర్ థెరపీ తదితర విభాగాలను సందర్శించారు. చిన్నారుల ఆరోగ్యానికి ఏ సమస్య వచ్చినా చికిత్స అందించాలనే సత్సంకల్పంతో ఈ సెంటర్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. అన్ని సౌకర్యాలతో కూడిన ఈ సెంటర్ జిల్లాలోనే మొట్టమొదటిది కావడం అభినందించదగ్గ విషయమన్నారు. సెంటర్ నిర్వహణకు ముందుకొచ్చిన పీడియాట్రిక్ విభాగం వైద్యులతో పాటు ఇతర విభాగాల వైద్యులను ఆయన అభినందించారు. సెంటర్ నిర్వహణకు యాజమాన్యం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సమాజం గౌరవించే విధంగా చిన్నారులకు అవసరమైన సేవలు అందించాలని వైద్యులను ఆయన కోరారు. ప్రత్యేక అతిథి డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పుట్టిన ప్రతీ బిడ్డ జీనియస్ అన్నారు. అయితే జీవన విధానంలో మార్పులు రావడం వల్ల బిడ్డల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. చిన్నారుల కోసం మిమ్స్‌లో చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభించడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులతో డాక్టర్ ప్రవీణ్ వర్మ ముచ్చటించారు. డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రఘురాం, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వేణుగోపాలరావు, పిడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ శివశంకర్ మూర్తి, ఫిజియో థెరపీ, హోమియో, నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సంషేర్ బేగం, ఏఓ గణేష్ పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

- అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ సోమేశ్వరరావు



మాట్లాడుతున్న అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ అల్లు సోమేశ్వరరావు

దెంకాడ: ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అందరినీ అక్షరాస్యులుగా చేసేందుకు అందరూ కృషి చేయాలని అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ అల్లు సోమేశ్వరరావు అన్నారు. మండల వెలుగు కార్యాలయంలో సీసీలు, వీవోఏలు, వలంటరీ టీచర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా డీడీ సోమేశ్వరరావు మాట్లాడుతూ.. 2024 నుంచి 2027 వరకు మూడేళ్ల పాటు ఉల్లాస్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 10 మంది అభ్యాసకులకు ఒక వలంటరీ టీచర్ ద్వారా ఆరు నెలల పాటు తరగతులు నిర్వహిస్తారని వివరించారు. అభ్యసకులకు మార్చి నెలలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్, ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ సంయుక్తంగా అసెస్మెంట్ పరీక్ష నిర్వహించి, సర్టిఫికేట్లు అందించడం జరుగుతుందన్నారు. స్థానిక వలంటరీ టీచర్లు గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఆరు నెలల పాటు 200 గంటలకు అభ్యసకులకు తరగతులు నిర్వహించాలన్నారు. డిజిటల్ లిటరసీ, ఫైనాన్సియల్ లిటరసీ, ఫంక్షనల్ లిటరసీ, చిన్నచిన్న పదాలు, లెక్కలను నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భవానీ, ఏపీఎం శ్రీనివాస్, ఎంఎల్‌వో రాంబాబు, వలంటీర్లు, వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.

ప్రణాళికతో పంచాయతీల అభివృద్ధి



మాట్లాడుతన్న ఎంపీడీఓ కిశోర్‌కుమార్

భోగాపురం: గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా పంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీఓ కిశోర్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 22 పంచాయతీల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వీఓఏలకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక నిధులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులను సమీకరించి వాటికి అనుగుణంగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. గ్రామాభివృద్ధిలో గ్రామ పెద్దలు, సామాజిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు అందరినీ భాగస్వాములను చేయాలని సూచించారు. గ్రామాల్లో సుస్థిర అభివృద్ధిని సాధించి, పంచాయతీలు అభివృద్ధి చెందేలా ప్రణాళికలు ఉండాలన్నారు. కార్యక్రమంలో సామర్లకోట ఈటీసీ ఫ్యాక్టరీ మెంబర్ సుజాత, డీపీఆర్‌సీ రిసోర్స్ పర్సన్స్ సుప్రియ, రఫీపఠాన్, ఈఓపీఆర్డీ గాయత్రి, ఏఓ కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌పీజీ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి

విజయనగరం: ఎల్‌పీజీ వంట గ్యాస్ వినియోగం, వినియోగదారుల భద్రత, ప్రమాదాలపై విద్యార్థినులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సీతారాం ఇండేన్ సర్వీస్ నిర్వాహకులు తలే సీతారాం అన్నారు. పట్టణంలోని దాసన్నపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఇండేన్ వినియోగదారుల భద్రత శిబిరాన్ని గురువారం నిర్వహించారు. వంట గ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సిలిండర్ పేలినా, గ్యాస్ లీకేజీ జరిగినా వెంటనే 1906 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. గ్యాస్ సిలిండరును ఎల్లప్పుడూ నిటారుగా ఉంచాలన్నారు. వంటగదిలో రిఫ్రిజిరేటరు కాని, వెలుగుతున్న దీపం కాని ఉంచరాదన్నారు. వంట పూర్తయ్యాక రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలన్నారు. ఐఎస్ఐ మార్క్ కలిగిన రబ్బరు ట్యూబులను ప్రతీ 5 సంవత్సరాలకొకసారి తప్పకుండా మార్చాలని, రబ్బరు ట్యూబు అమర్చినప్పుడు నూనె గానీ, సబ్బులాంటివి కాకుండా కేవలం నీళ్లు మాత్రమే వాడాలని సూచించారు. గ్యాస్ బుకింగ్ కోసం 8454955555, టోల్ ఫ్రీ నంబరు 18002333555 కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌వీ ఆస్పత్రి వైద్యులు జి.అనిల్‌కుమార్, టి.శిరీష, టి.సుదీర్, ఎం.నవ్యశృతి, పాఠశాల హెచ్‌ఎం, విశ్రాంత హెచ్‌ఎం టి.ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెహ్రూ అందరికీ ఆదర్శం



నెల్లిమర్ల: నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సతీష్, తదితరులు



విజయనగరం ఫోర్ట్: నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నెల్లిమర్ల: భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అందరికీ ఆదర్శమని కాంగ్రెస్ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ సమన్వయకర్త గంటా సతీష్ కొనియాడారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ సంపన్న కుటుంబంలో జన్మించిన నెహ్రూ జీవితమంతా నిరాడంబరంగా గడిపారన్నారు. పిల్లలంటే ఆయనకు అమితమైన ప్రేమన్నారు. ప్రస్తుత రాజకీయ నాయకులు నెహ్రూను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా దళిత చైతన్య సేవా సంఘం అధ్యక్షుడు సోము మురళీమోహన్, నెల్లిమర్ల మండల పార్టీ అధ్యక్షుడు కనకాల పద్మనాభం, సీనియర్ లీడర్ మురళిరాజు, సురాకాసి కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ సేవలు ఎనలేనివి

విజయనగరం ఫోర్ట్: దేశానికి మొదటి ప్రధానమంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ ఎనలేని సేవలు అందించారని డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ అన్నారు. స్థానిక డీసీసీ కార్యాలయంలో గురువారం మాజీ ప్రధాని నెహ్రూ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాసరావు, కరీమ్, షరీఫ్, రెహమాన్, చంద్రశేఖర్, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.